క్లుప్తంగా

క్రీడలతో స్నేహభావం


కప్ అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: క్రీడలతో స్నేహభావం, గెలుపోటములను సమానంగా స్వీకరించే మానసిక స్థైర్యం పెంపొందుతాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మల్యాల మండల ప్రీమియర్ లీగ్ సీజన్–4 లో మండల కేంద్రానికి చెందిన కాలికంటి రాజశేఖర్ జట్టు ఎంకేఆర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే కప్ అందజేసి, అభినందించారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో దొంగ ఆనంద రెడ్డి, దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ముత్యాల రాంలింగా రెడ్డి, మ్యాక లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఉర్దూ భాషా పరీక్షా పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని మదీనా మజీద్ ఆవరణలో ఆదివారం అబిద్ ఆలీ ఖాన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉర్దూ బాషా పోటీ పరీక్షలు నిర్వహించారు. అనంతర విజేతలకు బహుబతులు అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సోహెల్, ఉపాధ్యక్షుడు మహ్మద్ షాకీర్, సెక్రటరీ తబ్లిక్ జమాత్, జమాతే అధ్యక్షుడు మహ్మద్ సబీర్, నాయకులు అబ్దుల్ హసన్,షఫీ, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాలను దుర్వినియోగం చేయొద్దు


వివరాలు తెలుసుకుంటున్న వేణు

రాయికల్: ఎస్టీ అట్రాసిటీ చట్టాలను దుర్వినియోగం చేయొద్దని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కురిసెంగ వేణు అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో సందెల దుర్గపై వేసిన కేసు విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను దుర్వినియోగం చేయవద్దని బాధితులకు న్యాయం చేసేలా కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు ఆత్రం రవీందర్, కురిసెంగ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న నాయకులు

మేడిపల్లి: మండలంలోని కమ్మరిపేటలో బక్కశెట్టి మల్లేశ్వరికి రూ.45 వేలు, అందె విజయకి రూ.15 వేల విలువ గల చెక్కులు మంజూరు కాగా, లబ్ధిదారులకు కమ్మరిపేట కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రేండ్ల మధు, భర్కం శేఖర్, అంగలింగం,అడువాల రాజిరెడ్డి, భర్కం మల్లారెడ్డి, అడువాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే


బాకీ కార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెగడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే బీఆర్ఎస్ కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమం చేపట్టిందని వాటిని ఇంటింటికీ పంపిణీ చేసి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరిస్తామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేసి ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కానీ హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, రాజేశ్వర్‌రావు, రవి, గంగాధర్, శ్రీనివాస్, తిరుపతి, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, గంగాధర్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. యువ దంపతుల సంకల్పం

- సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు
- రూ.కోటితో వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణం


తుంగూర్‌లో కోటి రూపాయలతో నిర్మిస్తున్న పురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

సారంగాపూర్: తాము సంపాదించిన దాంట్లో కొంతవరకు పేద ప్రజలకు సాయం చేస్తూ, సామాజిక సేవలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. యువ దంపతులు.. తమ గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధికి సాయం చేస్తూ ఉదారతను చాటుకుంటున్నారు. వారే బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి ఓగుల అజయ్–అనిలా దంపతులు..

ఆలయాల అభివృద్ధి..

బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్–అనిలా దంపతులు గ్రామంలో వెయ్యేళ్ల కింది అతి పురాతన శ్రీ రుక్మిణి, సత్యభామ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణానికి ఏడాది క్రితం శ్రీకారం చుట్టారు. ఆలయం పూర్తిగా శిథిలం కావడంతో ఆలయాన్ని తామే సొంతంగా పునర్మిస్తున్నారు. అజయ్ జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లగా, అక్కడ లాటరీ టికెట్ కొనగా, రూ. 31 కోట్లు ప్రైజ్‌మనీ వచ్చింది. రెండేళ్ల క్రితం గ్రామానికి చేరుకున్న అజయ్ తనకు వచ్చిన సొమ్ములో అధిక మొత్తం సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు.

సేవా కార్యక్రమాలు..

అజయ్–అనిలా దంపతులు శ్రీ కృష్ణా ఫౌండేషన్‌ను స్థాపించి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పాఠశాలలకు శుద్ధజల వాటర్ ప్లాంట్‌లు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పేద విద్యార్థులకు సాయం, ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయం అందించారు.

ఆడపిల్లతో అదృష్టమని..

అనిలా–అజయ్ దంపతులకు మొదటి సంతానంగా ఆడపిల్ల పుట్టగా, తమ ఇంటికి మహాలక్ష్మీ వచ్చిందని భావించిన వారు తమ సంతోషాన్ని పంచుకోవడానికి గ్రామంలోని మహిళలందరికీ ఖరీదైనా చీరలు అందించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. తుంగూర్‌లో ఆటో డ్రైవర్లకు ఆండ్రాయిడ్ ఫోన్లు అందించారు.

పూర్తి కావొస్తున్న ఆలయం


అజయ్–అనిలా దంపతులు

గ్రామంలోని పురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నిర్మాణం తమిళనాడుకు చెందిన శిల్పులు, మేసన్‌లతో చేపట్టారు. ఏడాది క్రితం ప్రారంభించి ప్రస్తుతం పూర్తి కావొస్తోంది. స్వామివారి ఆలయ నిర్మాణం పూర్తయితే మా జన్మధన్యమని ఆ దంపతులు పేర్కొంటున్నారు.



కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు ఆరు నెలల నుంచి ఉండటంతో అవి పురుగులు పట్టి ముక్కిపోతున్నాయి. అదే గదిలో ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం ఉండటంతో వీటికి పురుగులు పట్టి చెడిపోతున్నాయి. అధికారులు చొరవ చూపి రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యంను వాపస్ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నిరంజన్, ఇరిగేషన్ డీఈ, సెల్ నంబర్: 8074092371

రాత్రి ఎనిమిది దాటితే బస్సే లేదు


ఆర్టీసీ బస్సు

రాయికల్: రాయికల్ పట్టణానికి జగిత్యాల నుంచి రాత్రి ఎనిమిది దాటితే ఆర్టీసీ బస్సు లేకపోవడంతో పట్టణ, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు నెలల క్రితం కురిసిన వర్షాలతో మూటపెల్లి, కొత్తపేట గ్రామాల మధ్య కల్వర్టు తెగిపోవడంతో జగిత్యాల డిపో నుంచి వచ్చే నైట్ హాల్ట్ బస్సును రద్దు చేశారు. అంతే కాకుండా రాత్రి ఎనిమిది దాటితే ఏకంగా జిల్లా కేంద్రం నుంచి రాయికల్ మున్సిపాల్టికి వచ్చే బస్సు సైతం నిలిపివేయడంతో పట్టణ, మండల ప్రయాణికులు వివిధ పనుల నిమిత్తం జగిత్యాల నుంచి రాయికల్‌కు రావాలంటే ప్రైవేట్ వాహనాల ద్వారా రావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వాహన యజమానులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.50 నుంచి 100 వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తపేట కల్వర్టు సైతం పూర్తి అయినప్పటికీ నైట్‌హాల్ట్ బస్సులు యథావిధిగా నడిపించాలని, అదే విధంగా రాయికల్ పట్టణానికి రాత్రి 9 గంటలకు వరకు జగిత్యాల డిపో నుంచి బస్సులను నడిపించాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జగిత్యాల డిపో మేనేజర్ కల్పనను సాక్షి వివరణ కోరగా సమాధానాన్ని దాటవేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పందించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రాయికల్‌కు బస్సును రాత్రివేళల్లో నడిపించాలని నైట్‌హాల్ట్ బస్సు పునరుద్ధరించాలని కోరారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


సంకీర్తనను సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేణి మల్లేశ్ అన్నారు. ఇటీవల జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన కొత్తపల్లి సంకీర్తనను రేగుంటలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆల్ యూత్, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు చెన్నూరి రమేష్, కుక్కుదుగు అశోక్, బైర రాజ్‌కుమార్, నల్ల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల హక్కుల రక్షణకు అంబేడ్కర్ కృషి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: బడుగు, బలహీన వర్గాల హక్కుల రక్షణకు అంబేడ్కర్ కృషి చిరస్మరణీయమని నకుమల్ల నర్సయ్య కొనియాడారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సయ్య జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అంటే కేవలం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించిన వ్యక్తిగా చిత్రీకరించే కుట్ర కొన్ని దశాబ్దాలుగా సాగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు నల్ల శ్యాం, కూర్మాచలం ఉమా మహేశ్, అనంతుల కాంతారావు, పులి గోవర్ధన్, బిరుదుల లక్ష్మణ్, నకుమల్ల సత్యం, అంబేద్కర్‌వాదులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత


గుంతలను పూడ్చి వేస్తున్న ట్రాక్టర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని జాతీయ రహదారి నుంచి అమ్మక్కపేట – ఇబ్రహీంపట్నం రోడ్డుపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద పెద్ద గుంతలు ఎర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గుంతలను పూడ్చివేయాలని పలుసార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ప్రజలు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడంతో అమ్మక్కపేట గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి క్రషర్ నుంచి డస్ట్‌ను తెప్పించి గుంతల్లో పోయించి ట్రాక్టర్ ద్వారా చదును చేయించారు. జాతీయ రహదారి నుంచి అమ్మక్కపేట వరకు ఉన్న గుంతలను పూడ్చివేయడంతో వాహనదారుల ఇబ్బందులు తొలగిపోయాయి. గుంతలను పూడ్చివేయించిన వెంకట్‌రెడ్డిని మండల ప్రజలు అభినందించారు.

పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలి


మాట్లాడుతున్న అడువాల జ్యోతి

జగిత్యాలటౌన్: పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని టీపీసీసీ అబ్జర్వర్ అడువాల జ్యోతి అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో జరిగిన సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు నరేశ్ కుమార్‌తో పాటు అడువాల జ్యోతి పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో స్థానిక నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు హైకమాండ్ నడుం బిగించిందని తెలిపారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సంఘటన్ సృజనచ్ అభియాన్‌ను ప్రారంభించిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల్లో గెలిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ విఠల్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ, బీసీసీ విశ్వప్రసాద్‌రావు, బాలేశ్ గౌడ్, మల్లేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పీసీసీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పరిషత్ మండల కమిటీ నియామకం

కోరుట్ల రూరల్: అఖిల భారత విశ్వకర్మ పరిషత్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వనతడుపుల రమణాచారి, ప్రధాన కార్యదర్శిగా మండలోజు పవన్‌కుమార్, కోశాధికారిగా మద్దెనపల్లి భూమయ్య, గౌరవ అధ్యక్షుడిగా విశ్వనాథుల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, శివులపల్లి రాజేశం, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా రాణించాలి


నేరెల్లలో మాట్లాడుతున్న జాజాల రమేశ్

ధర్మపురి: మున్నూరు కాపులు రాజకీయంగా రాణించాలని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు జాజాల రమేశ్ అన్నారు. మండలంలోని నేరెల్ల అరబిందో పాఠశాలలో ఆదివారం నేరెల్ల, గోవిందుపల్లెలకు చెందిన మున్నూరు కాపు నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ .. రానున్న ఎన్నికల్లో మున్నూరు కాపులంతా ఐకమత్యంగా ఉండాలని విద్య, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయంగా రాణించడానికి కాపులంతా ఏకతాటిపై నిలవాలన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధికి మంత్రి లక్ష్మణ్‌కుమార్ సహకరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఉమ్మడి నేరెల్ల, గోవిందుపల్లె గ్రామాల మున్నూరు కాపుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పురంశెట్టి సుధాకర్, రాజయ్య, కాశెట్టి మల్లేశం, నాయకులు జాజాల శంకర్ తదదితరులున్నారు.

కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్: కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ మోర సుమన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిటికెల రామాంజనేయులు, జాయింట్ సెక్రటరీగా పొన్నగంటి సతీష్‌కుమార్, కోశాధికారిగా దాత్రిక సంతోష్, ఉపాధ్యక్షుడిగా ఉరుమడ్ల మహేశ్, మెంబర్లుగా చిరంజీవి, మామిడిపెల్లి గణేశ్ ఎంపికయినట్లు చైర్మన్ మంచాల కృష్ణ తెలిపారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


కథలాపూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: వేములవాడలో శ్రీ రాజరాజేశ్వరస్వామిని భక్తులు దర్శించుకోవడాన్ని నిలిపివేయడంపై బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఏళ్ల చరిత్ర కలిగిన రాజరాజేశ్వరస్వామిని భక్తులు దర్శించుకోకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని మండిపడ్డారు. కాసేపు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రతాప్, ప్రమోద్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి కారణాలతో దేవస్థానాన్ని మూసివేసి నిత్య దర్శనాన్ని రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. ఆదివారం మేడిపల్లి, భీమారం మండలాల బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్యాల సురేష్, నాగం శివకుమార్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, తొటి తిరుపతి రెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపల్లిలో ఆర్ఎస్ఎస్ దశాబ్ది ఉత్సవాలు


శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు

మల్లాపూర్: మండలంలోని గొర్రెపల్లిలో ఆదివారం ఆర్ఎస్ఎస్ దశాబ్ధి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జగిత్యాల జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ సత్యంజీ పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా, సంఘంలోని శాఖ ద్వారా హిందువులను వ్యక్తి నిర్మాణం దిశగా ఆర్ఎస్ఎస్ నడిపిస్తుందన్నారు. దేశ పౌరులలో సాంస్కృతిక అవగాహన, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ఏర్పడిన సంస్థ ఆర్ఎస్ఎస్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా యువత, మహిళలు, మాతలు, మేధావులు, కుల సంఘాలతో సమ్మేళనాలు నిర్వహించి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మండల బాధ్యులు ఎగ్యారపు వెంకటేశ్వర్లు, కై ర నాగేష్, దానవేని కృష్ణకుమార్, కొడిమ్యాల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి



మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన వేముల మల్లయ్యకు చెందిన మేక ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆదివారం మేక మేతకు వెళ్లిందని ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా విద్యుత్ ఘాతానికి గురై మేక మృతి చెందినట్లు మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తనకు నష్టపరిహారం వచ్చేలా చూడాలని కోరారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



జగిత్యాలటౌన్: జగిత్యాల పావనీ ఆస్పత్రి, ఆపీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలోని 18 మంది పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేసి, నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా విజయ్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ సాల్లు సురేందర్, సిరిసిల్ల శ్రీనివాస్, నాయకులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ బుచ్చిరెడ్డిపై అసత్య ఆరోపణలు తగదు

మెట్‌పల్లి: మాజీ కౌన్సిలర్ బుచ్చిరెడ్డిపై ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు అసత్యపు ఆరోపణలు చేయడం తగదని రైతు సంఘ నాయకులు అన్నారు. మొరం తరలింపుతో పంటలు దెబ్బతిని తమకు నష్టం జరుగుతుందని బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో అధికారులను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బుచ్చిరెడ్డి డబ్బులు డిమాండ్ చేశాడని ఆరోపిస్తూ ఆయన ఇంటి వద్ద ఆందోళనలు చేయడం సరికాదన్నారు. అధికారులు వీరిపై చట్టపరంగా తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: మండల కేంద్రంలోని మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు.

35 ఏళ్ల తర్వాత 'అపూర్వ' సమ్మేళనం



మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విదిత్ రెడ్డి గార్డెన్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నాటి విద్యార్థులంతా తరలివచ్చారు. అందరూ కలిసి అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ ఎక్కడెక్కడో ఉన్న వారందరిని ఒక్క చోట చేర్చి ఈ సమ్మేళనం నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.